సర్వే డేటా ఎంట్రీ ముమ్మరం



చేవెళ్ల ఎంపీడీఓ కార్యాలయంలో సర్వే డేటా ఎంట్రీ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్లు

- మండలంలోని 25శాతం ఎంట్రీలు పూర్తి
- ఈ నెలాఖరు వరకు పూర్తి చేసేందుకు కసరత్తు

చేవెళ్ల: ఈ నెలాఖరు వరకు సమగ్ర కుటుంబ కులగణన సర్వే డేటా ఎంట్రీలను పూర్తి చేసేదిశగా అధికారుల కసరత్తు చేస్తున్నారు. మండలంలో గత మూడురోజులుగా సర్వే డేటా ఎంట్రీ ముమ్మరంగా కొనసాగుతోంది. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంతో పాటు కంప్యూటర్లు అందుబాటులో ఉన్న మరికొన్న చోట్ల డేటా ఎంట్రీలు చేపట్టారు. మండలంలో చేపట్టిన సమగ్ర కుటుంబ కులగణన సర్వే ఇప్పటికే స్టిక్కర్ల ద్వారా గుర్తించిన కుటుంబాల కంటే ఎక్కువగానే పూర్తి చేశారు. కొన్నిచోట్ల డోర్ లాక్ అయినవి, సర్వేకు వివరాలు చెప్పడానికి నిరాకరించిన వారు మాత్రమే మిగిలిపోయారు. ఇవీ కూడా 100 నుంచి 200ల లోపు కుటుంబాలు ఉండవచ్చని అంచనా. ఈ నెలాఖరు వరకు సర్వేపూర్తి చేయటంతోపాటు డేటా ఎంట్రీలను కూడా పూర్తి చేసి అందించాలని ప్రభుత్వ ఆదేశాల ఉండటంతో ఈ దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

25శాతం పూర్తి

చేవెళ్ల మండలంలో చేపట్టిన సమగ్ర కుటుంబ కులగణన సర్వే దాదాపు పూర్తయింది. మండలంలో స్టిక్కర్ల ద్వారా 16,945 కుటుంబాలను గుర్తిస్తే ఒక్కో కుటుంబంలో సర్వే సమయంలో రెండు కుటుంబాలు రాయించుకున్నవారు ఉన్నారు. దీంతో ఇప్పటివరకు సర్వేలో 17,291 కుటుంబాలకు సంబంధించి సర్వేఫామ్‌లు నింపారు. పలు గ్రామాల్లో డోర్‌లాక్ అయిన కొన్ని కుటుంబాలు సర్వే కోసం ఎన్యూమరేటర్లు ఎంత ప్రయత్నించినా అందుబాటులోకి రాకపోవటంతో అలాంటి కుటుంబాలు మండలంలో 100 నుంచి 200లోపు ఉంటాయని అంచనా వేస్తున్నారు. వీరికి కూడా ఈ నెలాఖరు డేటా ఎంట్రీ పూర్తి చేసేవరకు సర్వే వివరాలు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఎన్యూమరేటర్లు గుర్తించిన డోర్‌లాక్ కుటుంబాలకు ఫోన్‌ల ద్వారా సంప్రదిస్తూనే ఉన్నారు. ఇంకా ఎవరైనా తమ కుటుంబం సర్వే చేయలేదని చేయాలని మండల అధికారులను సంప్రదిస్తే కూడా వారి ఇంటి వద్దకు ఎన్యూమరేటర్లను పంపిస్తామని అధికారులు చెబుతున్నారు. ఎవరైనా మిగిలిపోయిన వారు ఉంటే నేరుగా అధికారులకు సమాచారం అందించాలని కోరుతున్నారు.

ఈ నెలాఖరువరకు అవకాశం



మండలంలో సర్వే పూర్తి చేసి గత మూడురోజులుగా సర్వే వివరాల డేటా ఎంట్రీ చేయిస్తున్నాం. అక్కడక్కడ కొన్ని డోర్‌లాక్ కుటుంబాలు మాత్రం మిగిలిపోయాయి. వాటికి కూడా డేటా ఎంట్రీ పూర్తయ్యే వరకు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉంది. మండలంలో ఎంపీడీఓ కార్యాలయం హాల్‌లో కంప్యూటర్లు ఏర్పాటు చేసి డేటా ఎంట్రీ చేయిస్తున్నాం. 50 కంప్యూటర్లతో 100 మంది సిబ్బందితో సర్వే నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటివరకు 25శాతం డేటా ఎంట్రీ పూర్తి చేశాం. ఈ నెలాఖరు వరకు పూర్తిగా చేసేందుకు కృషి చేస్తున్నాం.

– హిమబిందు, ఎంపీడీఓ, చేవెళ్ల

సర్వే ఆన్‌లైన్ ప్రక్రియ పరిశీలన



కొత్తూరు: సర్వే ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న డీపీఓ

కొత్తూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్ ప్రక్రియను కొత్తూరు మున్సిపాలిటీలో బుధవారం జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యూమరేటర్లు క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియపై ఆయన సిబ్బందికి పలు సలహాలు, సూచనలు అందజేశారు. అనంతరం డీపీఓ మండలంలోని గూడూరు గ్రామంలో గల జెడ్పీహెచ్‌ఎస్‌ను సందర్శించి తరగతి గదులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఓ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

20శాతం పూర్తయింది



కొందుర్గు మండల పరిషత్ కార్యాలయంలో డేటా ఎంట్రీ చేస్తున్న ఆపరేటర్లు

కొందుర్గు: సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించిన డేటా ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ చురుకుగా సాగుతోంది. మండలంలోని 22 గ్రామపంచాయతీలకు గాను 9,253 కుటుంబాలకు సంబంధించిన వివరాలను 78 మంది ఎన్యూమరేటర్లతో ఈ నెల 9 నుంచి ఇంటింటి సర్వే నిర్వహించామని ఎంపీడీఓ అనురాధ తెలిపారు. ఇప్పటివరకు 96శాతం సర్వే పూర్తయిందని ఆమె పేర్కొన్నారు. అదేవిధంగా సర్వే చేసిన ఆయా కుటుంబాల వివరాలను 34 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్ల ద్వారా ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నామని, ఇప్పటివరకు 20 శాతం పూర్తయిందని వివరించారు. ఈ ప్రక్రియను ఎంపీఓ లాలయ్య పర్యవేక్షిస్తున్నారు.



ఎవరూ లేకపోవడంతో చెత్తా, చెదారంతో నిండిన పాఠశాల

ఉపాధ్యాయుల్లేక బడి మూత

- సమాచారం లేదంటున్న ఎంఈఓ
- ఇతర పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థులు

శంకర్‌పల్లి: ఇటీవల డీఎస్సీలో ఉద్యోగం సాధించిన ఓ మాస్టర్ పాఠశాలకు రాకపోవడంతో ఆ పాఠశాల మూసివేశారు. దీంతో పాఠశాలలో చదివే నలుగురు విద్యార్థులు దగ్గరలోని మరో ప్రభుత్వ పాఠశాలలకు వెళ్తున్నా రు. మండలంలోని ఇరికుంట తండాలో ప్రభు త్వ ప్రాథమిక పాఠశాల ఉంది. ఈ ఏడాది ప్రారంభంలో ఆ పాఠశాలకు నలుగురు విద్యార్థులు వస్తుండగా.. ఉపాధ్యాయులు సరిగా లేకపోవడంతో వారు దగ్గరలోని దొంతాన్‌పల్లి, మహారాజ్ పేట్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశా లకు వెళ్తున్నారు. అయితే 2024 డీఎస్సీలో ఉద్యోగం సంపాదించిన హైదరాబాద్ ప్రాంతానికి చెందిన బార్కం శ్రీశైలంకు ఇరికుంటతండాకు పోస్టింగ్ ఇచ్చారు. చిన్నప్పటి నుంచి దృష్టి లోపం కారణంగా శ్రీశైలం ఆ పాఠశాలలో రిపోర్ట్ చేసి, మరో రెండు రోజులు వచ్చి.. ఎవరికీ సమాచారం ఇవ్వకుండా పాఠ శాలకు రావడం మానేశాడు. తమ స్కూల్‌కు మాస్టరు వచ్చాడ ని సంతోషించిన విద్యార్థుల కు ఆ సంతోషం ఎంతో సేపు నిలవలేదు. దీంతో మళ్లీ విద్యార్థులు తమకు 5కి.మీ దూరంలో ఉన్న ఇతర ప్రభుత్వ పాఠశాలలకు వెళ్తున్నారు. దీనిపై మండల విద్యాధికారి అక్బర్‌ని వివరణ కోరగా..శ్రీశైలం పాఠశాలలో రిపోర్టు చేసి, వెళ్లాడు. మళ్లీ పాఠశాలలకు రాలేదు. దీని గురించి పలుమార్లు ఫోన్ చేసినా స్పందన లేదు. సమస్యను జిల్లా విద్యాధికారి దృష్టికి తీసుకెళ్తాం.

వైభవంగా దేవాలయ వార్షికోత్సవం



అయ్యప్ప దేవాలయంలో పడిపూజ నిర్వహిస్తున్న స్వాములు

చేవెళ్ల: స్వామియే అయ్యప్ప.. అయ్యప్ప స్వామియే. స్వామి శరణం అయ్యప్ప శరణం అంటూ అయ్యప్ప నామస్మరణతో అయ్యప్ప దేవాలయ ప్రాంగణం మార్మోగింది. మండల కేంద్రంలో ఉన్న అయ్యప్ప దేవాలయం 17వ వార్షికోత్సవాన్ని బుధవారం అయ్యప్ప భక్తులు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అయ్యప్ప మాలధరించిన స్వాములు ఆలయంలో అయ్యప్ప పడిపూజ నిర్వహించారు. ఈ పూజలను గురుస్వామి ఎంఎం కృష్ణణ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిపించారు. మండలంలోని అయ్యప్ప మాలధరించిన స్వాములు పెద్ద సంఖ్యలో హాజరై అయ్యప్ప భజనలు, భక్తిగీతాలను ఆలపించారు. అయ్యప్ప పడిలో పాల్గొనేందుకు వేలంపాట నిర్వహించగా చేవెళ్ల గ్రామానికి చెందిన జూకన్నగారి శ్రీకాంత్‌రెడ్డి వేలంపాటలో పాల్గొని పడిపూజ నిర్వహించారు. ఇబ్రహీంపల్లి గ్రామానికి చెందిన పైండ్ల శ్రీనివాస్‌రెడ్డి భక్తులకు అన్నదాన వితరణ చేశారు. అయ్యప్ప సేవా సమితి సన్నిధానం స్వాములు, మండలంలోని అన్ని గ్రామాల్లో మాలధరించిన స్వాములు ఈ వార్షికోత్సవ పడిపూజలో పాల్గొన్నారు.

రైతులకు మహర్దశ రాబోతోంది

- విజన్ ఉన్న నాయకుడు రేవంత్‌రెడ్డి
- మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులకు మహర్దశ రాబోతోందని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణ సమీపంలోని మార్కెట్ ఆవరణలో వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి విజన్ ఉన్న నాయకుడని, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ఆయన ముందుకు సాగుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ పాలకులు అబద్ధాలతో పరిపాలన చేశారని విమర్శించారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను లక్షల కోట్లు అప్పుల ఊబిలోకి నెట్టారన్నారు. వాళ్లు చేసిన అప్పులకు సీఎం రేవంత్‌రెడ్డి మిత్తిలు కడుతున్నారన్నారు. కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, కార్యకర్తలు అధైర్యపడకుండా ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అన్ని రంగాల్లో వెనుకబడిన కొడంగల్ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు ఇండస్ట్రీయల్ పార్కును ఏర్పాటు చేసేందుకు సీఎం కృషి చేస్తున్నారన్నారు. అభివృద్ధిని అడ్డుకోవాలని కుట్రలు పన్నుతున్న కేటీఆర్ బృందానికి తగిన గుణపాఠం తప్పదన్నారు. కార్యక్రమంలో గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ నాగేశ్వర్‌రావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచనకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ మహ్మద్‌అలీఖాన్‌బాబర్, మాజీ ఎమ్మెల్యే భీష్వ కిష్టయ్య, నాయకులు యాదయ్యయాదవ్, శివశంకర్‌గౌడ్, తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి, అగ్గనూరి విశ్వం, వెంకట్రామిరెడ్డి, కాశీనాథ్‌రెడ్డి, జమ్రుద్‌ఖాన్, ఎండీ.ఇబ్రహీం, రఘునాయక్, పురుషోత్తంరెడ్డి, కొంకళ్ల చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంఈఓ మనోహర్

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కేశంపేట: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రజాపాలన విజయోత్సవాలను బుధవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులకు పునరుత్పాదక శక్తి వనరులు అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ వ్యాసరచన పోటీల్లో ఆంగ్ల మాధ్యమంలో పాపిరెడ్డిగూడ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు అర్చన (ప్రథమ), క్రాంతి కిరణ్ (తృతీయ), కేశంపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి హారిక (ద్వితీయ) స్థానాల్లో నిలిచారు. తెలుగు మాధ్యమంలో కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విదార్థులు ధనూశ్(ప్రథమ), తులసి(తృతీయ), ఎక్లాస్‌ఖాన్‌పేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి సింధులు నిలిచారు. మండలస్థాయిలో గెలుపొందిన విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని మండల విద్యాధికారి చంద్రశేఖర్ అభినందించి, బహుమతులు అందించారు. కార్యక్రమంలో కేశంపేట జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విద్యావతి, ఉపాధ్యాయులు జగదీశ్వర్‌రెడ్డి, శ్రీశైలం, రాజేందర్, సీఆర్పీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గైర్హాజరవుతుంటే ఏం చేస్తున్నట్లు?

- ఎంపీడీఓ శైలజ
- కస్తూర్బా గాంధీ పాఠశాల, హాస్టల్‌లో తనిఖీలు

మహేశ్వరం: కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థులు ఎక్కువ మొత్తంలో గైర్హాజరవుతుంటే ప్రిన్సిపాల్ ఏం చేస్తున్నారని ఎంపీడీఓ శైలజ నిలదీశారు. బుధవారం మండల పరిధిలోని కేసీతండా పరిధిలో ఉన్న కస్తూర్బా గాంధీ పాఠశాల, హాస్టల్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేపట్టి వంట గది, వండిన భోజనం, కూరగాయలు, వంట సామగ్రిని ఆమె పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యార్థులు 73 మంది విద్యార్థులు గైర్హాజరవుతుంటే ప్రిన్సిపాల్ ఏం చేస్తున్నారని హెచ్చరించారు. విద్యార్థుల హాజరుశాతం పెంచాల్సిన బాధ్యత ప్రిన్సిపాల్ తీసుకోవాలన్నారు. కస్తుర్బా గాంధీ పాఠశాల నిర్వహణపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టారని, ప్రిన్సిపాల్, హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని ఆమె సూచించారు. విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనం అందించాలన్నారు. చలికాలం కావడంతో విద్యార్థులకు దుప్పట్లు, చద్దర్లు పంపిణీ చేపట్టాలన్నారు. అంతకుముందు హాస్టల్‌లో వంటశాల, సామగ్రి, కూరగాయలు, వండిన వంటలను ఆమె పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టీలను ఆమె పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఎం సత్యనారాయణ, ప్రిన్సిపాల్ పద్మలత, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



హాస్టల్‌లో వంటలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శైలజ

శీతాకాలం.. జీవాలు పదిలం

గొర్రెలు, మేకలకు వ్యాధులు సోకే అవకాశం

- ముందు జాగ్రత్తలతో రోగాల నివారణ
- పెంపకందారులకు పశువైద్యుల సూచనలు



పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి



తిమ్మారెడ్డిగూడలో మేతకు తీసుకెళ్తున్న గొర్రెలు

షాబాద్: చలికాలం ప్రారంభమైంది. గొర్రెలు, మేకల పెంపకందారులు సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే వ్యాధులు విజృంభించి జీవాలు మృతి చెందే ప్రమాదముంది. చలికాలంలో తీవ్రమైన వ్యాధులు సోకే అవకాశముందని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ప్రధానంగా పీపీఆర్ (పారుడు), మశూచి, చిటుక తదితర వ్యాధులు జీవాలపై తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. వ్యాధి కారక సూక్ష్మజీవులు ఒక్క గొర్రె లేదా మేకలో ఉన్నా మందలో ఉన్న అన్నింటికీ సోకే ప్రమాదముందని చెబుతున్నారు. గొర్రెలు, మేకల పెంపకందారులు తగిన జాగ్రత్తలు పాటిస్తే వ్యాధుల బారిన పడకుండా జీవాలను కాపాడుకోవచ్చని సూచిస్తున్నారు.

దోమలు, కీటకాలతో వచ్చే వ్యాధులు

దోమలు, కీటకాల బారి నుంచి గొర్రెలు, మేకలను రక్షించి వాటికి నీలి నాలిక వ్యాధి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా గొర్రెలు, మేకలు చలికాలంలో (సర్ప) తిక్క రోగం బారిన పడతాయి. నదీ పరివాహక ప్రాంతాల్లో సంచరించే గొర్రెలు, మేకలకు దోమకాటు ద్వారా ఈ వ్యాధి ఎక్కువగా సోకుతుంది. దీనిని తొందరగా గుర్తించకుంటే ఆ జీవి మృతి చెందే ప్రమాదముంది. వ్యాధి లక్షణాలను పెంపకందారులు ప్రాథమిక దశలోనే గుర్తించి జాగ్రత్తపడితే ఎలాంటి ప్రమాదముండదు. సాయంత్రం పాకలు, మందుల వద్ద వేపాకు ధూపం వేయాలి. రాత్రి పూట మంద దగ్గర మంట పెడితే కీటకాలు మంటకు ఆకర్షింపడి నశిస్తాయి. గొర్రెలు, మేకలను చలి బారి నుంచి రక్షించడం కోసం పాకలు ఏర్పాటు చేయాలి. వాటికి న్యుమోనియా (ఉమ్మి) వ్యాధి సోకకుండా కాపాడుకోవాలి.

వ్యాధులు.. జాగ్రత్తలు

గొర్రెలు, మేకలకు వ్యాధి సోకినట్లయితే వాటిని గుర్తించి మంద నుంచి వేరుచేయాలి. ప్రత్యేక ప్రదేశంలో ఉంచి సమీప పశువైద్యుడిని సంప్రదించి చికిత్స అందించాలి. వ్యాధి సోకిన గొర్రెలు, మేకలను మందలో కలపకూడదు. వాటికి సులువుగా జీర్ణమయ్యే ఆహారం, పరిశుభ్రమైన తాగునీటిని అందించాలి. పూర్తిగా కోలుకున్న తర్వాతే మందలో కలపాలి. అదేవిధంగా వ్యాధులు సోకిన గొర్రెలు, మేకలను ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లకూడదు. అలాచేస్తే వ్యాధితో అవి చనిపోతాయి. ఒకవేళ గొర్రె లేదా మేక మృతి చెందితే దాని కళేబరాన్ని ఊరికి దూరంగా లోతైన గొయ్యి తీసి అందులో సున్నం వేసి పూడ్చిపెట్టాలి. వ్యాధులు సోకి గొర్రెలు, మేకలు చనిపోయిన ప్రదేశాన్ని క్రిమిసంహారక ద్రావణంలో శుభ్రం చేయాలి. చనిపోయిన జీవి తినగా మిగిలిన గడ్డిని కాల్చివేయాలి. నీటి పాత్రలను క్రిమిసంహారక ద్రావణంతో శుభ్రపరిచి ఎండలో ఆరబెట్టాలని పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు.

క్లుప్తంగా

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి విరాళం



గురుస్వామికి విరాళం అందజేస్తున్న లక్ష్మణ్‌నాయక్

నందిగామ: మండల కేంద్రమైన నందిగామలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి తాటిగడ్డ తండాకు చెందిన జటావత్ లక్ష్మణ్‌నాయక్ బుధవారం రూ.25వేల నగదును గురుస్వామి గిరిషన్ నాయర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా గురుస్వామి మాట్లాడుతూ.. పురాతన చరిత్ర కలిగిన అయ్యప్ప స్వామి ఆలయ పునర్నిర్మాణానికి భక్తులు స్వచ్ఛందంగా ముందుకు వస్తుండటం సంతోషకరమన్నారు. వచ్చే ఏడాదిలో అయ్యప్ప ఆలయంలో పెద్దఎత్తున విగ్రహాలు ప్రతిష్ఠించి, దేవాలయాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో గురుస్వాములు లక్ష్మయ్యయాదవ్, దేపల్లి కుమార్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, బాల్‌రెడ్డి, జంగయ్య, శ్రీకాంత్, శేఖర్, నర్సింహ, వెంకటేశ్వర్‌రావు, హనుమంత్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సభలను విజయవంతం చేయండి

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మహబూబ్‌నగర్‌లో నిర్వహించే రైతు సభలను విజయవంతం చేయాలని బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి కోరారు. ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా ఈ నెల 28, 29, 30 తేదీలలో రైతులకు వ్యవసాయ పరికరాలు, ఆధునిక పద్ధతులు, యాంత్రీకరణపై స్టాళ్లను ఏర్పాటు చేస్తామని వివరించారు. ఈ స్టాళ్లను చూసి వ్యవసాయంలో పాటించాల్సిన మెలకువలపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ నెల 30న నిర్వహించనున్న రైతు సదస్సుకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారని, ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

నేడు చేవెళ్లలో చెక్కుల పంపిణీ

చేవెళ్ల: మండలానికి సంబంధించిన లబ్ధిదారులకు వచ్చిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే కాలె యాదయ్య చేతుల మీదుగా గురువారం పంపిణీ చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో మండలంలోని 44 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్, 66 మందికి వచ్చిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేయనున్నట్లు తెలిపారు. ఈ చెక్కులు వచ్చిన లబ్ధిదారులు, మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

నియామకం

తుక్కుగూడ: సమాచార హక్కు చట్టం సాధన కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా వంటేపాక శ్రవణ్ నియామకమయ్యారు. ఈ మేరకు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు చంటి ముదిరాజ్, మహిళా అధ్యక్షురాలు సూర స్రవంతి నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో బుధవారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రవణ్ మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆర్టీఐ చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మల్లం వెంకటేశ్, గుండెల రాయుడు, గంగా రజిని ప్రియారెడ్డి, శివ, బత్తుల మహేశ్‌గౌడ్, నరేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

చొరబాట్లను అరికట్టాలని వినతి



ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: బంగ్లాదేశీయుల చొరబాట్లను అరికట్టాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి బుధవారం సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. భగత్‌సింగ్‌నగర్, అంబేడ్కర్‌నగర్‌లో బంగ్లాదేశీయులు నివాసముండకుండా చర్యలు తీసుకొని, స్థానికులకు సురక్షిత, ప్రశాంతమైన వాతావరణాన్ని అందించాలని కోరారు. ఇందుకు కార్డన్ సెర్చ్ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.